# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

బుధవారం | 9 జూలై 2025 | పేజీలు 8




మల్లంపేట్‌లో ప్రణీత్ బిల్డర్స్ ఐదంతస్తుల అక్రమ నిర్మాణం.. ప్రస్తుత చిత్రం..

## 100 ఫీట్ల రోడ్డు ఆక్రమణతో..!

# అనుమతుల్లేని ఐదంతస్తులు..!

**మున్సిపల్ కూల్చివేతలతో దృఢత్వం కోల్పోయిన అక్రమ కట్టడంలో పనులు..**

- ఫైల్ నెంబర్ "TS/029842/2024" ప్రతిపాదనలు తిరస్కరించిన మున్సిపల్..
- 2024 జూలై 3న కూల్చివేసిన దుండిగల్ మున్సిపల్ అధికారులు..
- 2025 జూలైలో తాజాగా మళ్ళీ నిర్మాణ పనులు..
- పాత కమిషనర్ హయాంలో కూల్చివేత.. కొత్త కమిషనర్ రాకతో పనులు షురూ..
- గ్యాస్ కట్టర్‌లతో స్లాబులు కూల్చేసిన అదే అక్రమ నిర్మాణంలో బరితెగించి పనులు..
- టౌన్‌ప్లానింగ్ అధికారి సంజునా దృష్టికి తీసుకెళ్ళినా చర్యలు శూన్యం..

- మల్లంపేట్ సర్వే నెం.172/ఎ, ప్లాట్ నెం.88, 89 లో భారీ అక్రమ నిర్మాణం..
- మాదాసు రామచంద్ర కాలనీలో ప్రణీత్ బిల్డర్స్ అక్రమ బహుళ అంతస్తులు..
- 100 ఫీట్ల రోడ్డును ఆక్రమించి 500 గజాల్లో ఐదంతస్తుల నిర్మాణానికి "నో పర్మిషన్"..
- టౌన్‌ప్లానింగ్ అధికారి ఉన్నా లేనట్టే..! అక్రమ కట్టడాలే లక్ష్యంగా మేడమ్ విధులు..
- టౌన్‌ప్లానింగ్ విభాగం తన పరిధిలోకి రాదంటున్న మున్సిపల్ "ప్రత్యేక అధికారి"..
- లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ పట్టించుకోక..! స్పెషల్ ఆఫీసర్ పరిధిలో లేక..!
- చట్టాలను గౌరవించని మున్సిపాలిటీ, "టిజి-బిపాస్" చట్టం బుట్ట దాఖలు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 8: ఎలాంటి అనుమతులు లేకుండా..! హెచ్‌ఎండిఏ 100 ఫీట్ల రోడ్డును ఆక్రమించి..! బడా నిర్మాణ సంస్థ బరితెగింపుతో సుమారు 500 గజాల్లో, యధేచ్ఛగా 5 అంతస్తుల అక్రమ కట్టడంపై దుండిగల్ మున్సిపల్ అధికారులు 2024 జూలై 3న కూల్చేశారు.. ఇప్పుడు అదే అక్రమ కట్టడంలో బరితెగించి నిర్మాణ పనులు వేగవంతం చేస్తుంటే..! మున్సిపల్ అధికారుల సహకారం హద్దుమీరుతోంది.. ఉన్నతాధికారుల మందలింపు లేకపోవడం ఒకవంతైతే.. పలుకుబడి ఉన్న అధికారుల బరితెగింపుతో ముడుపులు పుచ్చుకుని సహకరిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. అనుమతులు నిరాకరించిన మున్సిపల్ అధికారులు..! దొడ్డి దారిలో సహకరించడాన్ని ఏమంటారో..! దుండిగల్ మున్సిపల్ ప్రత్యేక అధికారి సాయినాథ్ (సిడిఎంఎ) చెబుతారా..? లేక తన పరిధిలో లేని విషయం గురించి తెలియదని అంటారా..?

-2లో

## భూ భారతి దరఖాస్తులు పరిశీలించిన..

# అడిషనల్ కలెక్టర్..

### మేడ్చల్ తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష..



- మేడ్చల్ ఎమ్మార్వో కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తనిఖీలు..
- భూ భారతి సదస్సు- ఆన్‌లైన్ దరఖాస్తులను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన..
- భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు ఎన్ని పరిష్కరించారు..?
- దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు అదనపు కలెక్టర్ ఆదేశాలు..
- పరిశీలనలో ఎదురయ్యే సమస్యలపై తహశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు..

-3లో

## జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ

# అభివృద్ధికి సహకరించండి

హైదరాబాద్ పెన్ పవర్: ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి బిజీ బిజీగా గడుపుతున్నారు. వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అవుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం (జూలై 8) ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్

-3లో



# 100 ఫీట్ల రోడ్డు ఆక్రమణతో..! అనుమతుల్లేని ఐదంతస్తులు..!



2024 జూన్ నెలలో తీసిన.. ఫైల్‌ఫోటో..నాటి కూల్చివేతకు ముందు.. ఫైల్‌ఫోటో..



ఏడాది తర్వాత ఇలా పనులు షురూ..



ప్రస్తుతం ప్రణీత్ అక్రమ నిర్మాణం ఇలా ఉంది..


గ్యాస్ కట్టర్‌లతో కూల్చిన స్లాబులు లోపల చూడవచ్చు.. తాజా చిత్రం..


మల్లంపేట్ ప్రణీత్ అక్రమ నిర్మాణాన్ని 2024 జూలై 3న కూల్చిన.. ఫైల్‌ఫోటో..


దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్ గ్రామం, మాదాసు రామచంద్ర కాలనీ లోని సర్వే నెం.172, ప్లాట్ నెం: 88, 89, లలో ఈ ప్రణీత్ ప్రాజెక్ట్‌కై.. నిర్మాణ అనుమతులకు "2024 జూన్ 7న" బిల్డర్ ఫైల్ నెంబర్ "%ూ%/029842/2024" ప్రతిపాదనలను నిబంధనలకు విరుద్ధంగా సమర్పించారు.. అయితే అప్పటికే 100 ఫీట్ల హెచ్ఎండిఏ ప్రపోస్డ్ రోడ్డు ఆక్రమణతో, స్టిల్ట్‌ం5 అంతస్తులకు స్లాబులు కూడా నిర్మించారు.. నేతలతో ఒత్తిడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి.. అయినప్పటికీ తలొగ్గకుండా, అనుమతులను తిరస్కరించారు.. 2024 జూలై 3న కూల్చివేతలు తెలిసిందే.. ఇదంతా గతంలో..! మరి ఇప్పుడు ఏమైంది..? అక్రమ నిర్మాణంలో పనులు సాఫిగా కొనసాగటానికి ముడుపులే కారణమా..? హాస్యాస్పద విషయం ఏమిటంటే..! మున్సిపల్ ప్రత్యేక అధికారి పరిధిలోకి ఈ అక్రమ నిర్మాణాలు రావని సంబంధిత స్పెషల్ ఆఫీసర్ సాయినాథ్ చెప్పడం గమనార్హం..

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ మొదలుకుని..! సిడిఎంఎ నుండి మున్సిపాలిటీలకు ఇన్‌చార్జ్‌గా నియమించిన "ప్రత్యేక అధికారి"తోపాటు..! బాధ్యతగల దుండిగల్ మున్సిపల్ అధికారులు ఉన్నప్పటికీ..! టిజి-బిపాస్ చట్టం అమలుకు నోచుకోక పోవడం బాధాకరం.. దుండిగల్ మున్సిపాలిటీలో, అధికారులు మారినా అక్రమ నిర్మాణాల దందా మాత్రం యధావిధిగానే కొనసాగుతుంది.. గతంలో విధుల్లో ఉన్న కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారుల అడుగుజా డల్లోనే ప్రస్తుత అధికా రులు నడుస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.. ఓవైపు హైదరాబాద్ మహానగరంతో పాటు, శివారు మున్సిపాలిటీ లలో నిర్మించే అక్రమ కట్టడాలపై, హైకోర్టు పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసినా..! అధికారుల్లో మార్పు రావడంలేదు.. ఇక దుండిగల్ మున్సిపాలిటీలో టిపిఎస్ సంజునా సౌజన్యంతోనే విచ్చలవిడిగా ప్రమాదకర అక్రమ కట్టడాలు నిర్మితం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు..

## టిపిఎస్ సంజునా సౌజన్యంతో ప్రణీత్ బిల్డింగ్..?

దుండిగల్ మున్సిపాలిటీలో అక్రమ కట్టడాల దందా "మూడు పూవులు ఆరు కాయలు" అన్నచందంగా తయారైంది.. టిపిఎస్ సంజునా పలుకుబడి ఉందనే ధీమానో..! లేక మొత్తం మున్సిపల్ వ్యవస్థ, ఇలాగే ఉంటుందో ఏమో కానీ..!మున్సిపాలిటీలోని అక్రమ షెడ్లకు, అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలకు యంత్రాంగం బరితెగించి సహకరిస్తున్నారు.. మల్లంపేట్ సర్వే నెం.172 మాదాసు రామచంద్ర కాలనీలోని..! ప్రణీత్ నిర్మాణ సంస్థ కామరాజు నరేంద్ర కుమార్‌కి చెందిన..!ప్లాట్ నెం.88, 89 లో సుమారు 500 గజాల్లో..! "స్టిల్ట్‌ం5" బహుళ అంతస్తుల అక్రమ కట్టడానికి, ఎలాంటి అనుమతులు తీసుకోలేదు.. అయినప్పటికీ టౌన్‌ప్లానింగ్ అండతో దర్జాగా ఐదంతస్తులకు గతేడాది స్లాబులు నిర్మించారు.. బాధ్యత లేని టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు ఎలా ఉందో గమనించండి..! పత్రికల్లో వార్తా కథనాలు వస్తేకానీ స్పందించలేదు..! ఐదు అంతస్తులకు స్లాబులు వేసే క్రమంలో అధికారులు విధుల్లో లేరా..? ఇక్కడ మున్సిపాలిటీ లేదా..? అదేదో అప్పుడే తెలిసినట్లు, "2024 జూలై 3న" గ్యాస్ కట్టర్‌లతో స్లాబులు కూల్చేశారు.. ఈ చర్యల వ్యవహారం గత మున్సిపల్ కమిషనర్ హయాంలో జరిగింది.. అప్పటి నుండి ఏడాది పాటు పనులు చేపట్టలేదు.. అయితే కొత్త కమిషనర్ బాధ్యతలు, ప్రత్యేక అధికారి నియామకం అనంతరం..! తాజాగా పనులు మళ్ళీ మొదలు పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది..



ప్రణీత్ ప్రాజెక్టుకై మున్సిపాలిటీకి సమర్పించగా తిరస్కరించిన ఫైల్..

# భూ భారతి దరఖాస్తులు పరిశీలించిన.. అడిషనల్ కలెక్టర్..

## మేడ్చల్ తహాశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష..



మేడ్చల్ తహాశీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సమీక్ష..




- మేడ్చల్ ఎమ్మార్వో కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తనిఖీలు..
- భూ భారతి సదస్సు- ఆన్‌లైన్ దరఖాస్తులను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన..
- భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు ఎన్ని పరిష్కరించారు..?
- దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు అదనపు కలెక్టర్ ఆదేశాలు..
- పరిశీలనలో ఎదురయ్యే సమస్యలపై తహాశీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 8:** ఆన్‌లైన్ ద్వారా భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరం చూపాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మేడ్చల్ తహాశీల్దార్‌ను ఆదేశించారు.. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మేడ్చల్ ఎంఆర్ఓ కార్యాలయంలో భూ భారతి, రెవెన్యూ సదుస్సులు, మీ సేవా సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు.. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదుస్సులలో తీసుకున్న దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, అందులో ఎన్ని పరిష్కరించారని ఎంఆర్ఓ భూపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని, దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో అవసరమైతే క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు.. అదేవిధంగా క్షేత్రస్థాయి పరిశీలనలో ఎదురయ్యే సమస్యల గురించి కూడా తహాశీల్దార్‌ను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మీ సేవ ద్వారా జారీ చేసే సర్టిఫికెట్ల గురించి ఆరా తీస్తూ, సర్టిఫికెట్ల జారీలో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించి ధృవీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు.. కార్యాలయం లోని ఫైళ్లను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎంఆర్ఓ భూపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించండి: సీఎం రేవంత్

- మొదటి పేజి తరువాయి

గోయల్?ను కలిశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ (ZISC) అభివృద్ధికి సహకరించాలని గోయల్?కు విజ్ఞప్తి చేశారు సీఎం రేవంత్. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి పలు కీలక ప్రాజెక్టుల విషయంపై చర్చించారు.

జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు కార్యక్రమం కింద ఆమోదించిన ? 596.61 కోట్లను సత్వరం విడుదల చేయాలని కోరారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ – వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్ – విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు.తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్క్‌ను ఏర్పాటు చేసిందని వివరిస్తూ, హైదరాబాద్ – బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో–డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని సీఎం రేవంత్ రిక్వెస్ట్ చేశారు.

పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలనిగోయల్?ను? కోరారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్?తో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి , చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అయ్యా కేటీఆర్ నాతో పెట్టుకుంటే నాశనమవుతావు: మంత్రి సీతక్క





**హైదరాబాద్ పెన్ పవర్:**“అయ్యా కేటీఆర్, మీ చెల్లి ఎలాగూ మీ మీద మన్ను పోస్తోంది. నాతో పెట్టుకుంటే మీరు నాశనం అవుతారు. ఇంతకంటే నేను ఏమీ అనలేను. నాతో పెట్టుకుంటే మీరేం బాగుపడరు. నేను శాపనార్థాలు పెట్టగలను, అంతే. మీలాగా కులబలం, ధనబలం, అహంకారం నాకు లేవు. నేను ఒంటరిదాన్ని. నా ఒక్కగానొక్క అన్న కూడా ఉద్యమంలో చనిపోయాడు. నా నియోజకవర్గమే నాకు అండ. నా ములుగు ప్రజల దీవెనలతో నేను మంత్రిని అయ్యాను. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సహకారంతో నేను మంత్రిని అయ్యాను” అని అన్నారు. బీఆర్ఎస్ నేతలు తనపై కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకించి బీఆర్ఎస్ నేత కేటీఆర్ తనను వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుని మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు. ములుగు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని, అందుకే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ఎంతోమంది ఆత్మహత్యలకు కారణమైన వారు, ఇప్పుడు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగడం ఎంతమాత్రం సరికాదని సీతక్క హితవు పలికారు. కేవలం రాజకీయ ఉద్దేశంతోనే తనపై, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆమె స్పష్టం చేశారు.

# హైడ్రా పనితీరు అద్భుతం: హైదరాబాద్‌లో కర్ణాటక ఇంజినీర్ల బృందం

- హైదరాబాద్ చెరువుల పునరుద్ధరణ పనుల పరిశీలన
- హైడ్రా పనితీరుపై కర్ణాటక ఇంజినీర్ల బృందం ప్రశంసలు
- అన్ని రాష్ట్రాలకూ హైడ్రా లాంటి వ్యవస్థ అవసరమని అభిప్రాయం
- చెరువుల కబ్జాల వల్లే వరదలొస్తున్నాయని వెల్లడి
- తమ రాష్ట్రంలోనూ ఇలాంటి వ్యవస్థ ఏర్పాటుకు కర్ణాటక ప్రభుత్వం యోచన




హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చెరువుల పరిరక్షణ కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. హైదరాబాద్‌లో 'హైడ్రా' ఆధ్వర్యంలో జరుగుతున్న చెరువుల పునరుద్ధరణ పనులను కర్ణాటకకు చెందిన ఇంజినీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను చూసి వారు ప్రశంసల వర్షం కురిపించారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా, కాలుష్యం బారిన పడి పూర్తిగా కనుమరుగైన చెరువులను హైడ్రా అభివృద్ధి చేస్తున్న తీరు అద్భుతంగా ఉందని ఇంజినీర్ల బృందం అభిప్రాయపడింది. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను కాపాడటం కత్తి మీద సాము లాంటిదని, అలాంటి క్లిష్టమైన పనిని తెలంగాణ ప్రభుత్వం సమర్థంగా నిర్వహిస్తోందని కొనియాడింది. చెరువులు, నాలాలు కబ్జాలకు గురికావడం వల్లే నగరాల్లో వరదలు ముంచెత్తుతున్నాయని వారు పేర్కొన్నారు. హైడ్రా గురించి పత్రికల్లో చదివి ప్రత్యక్షంగా చూసేందుకు ఇక్కడికి వచ్చామని బృంద సభ్యులు తెలిపారు. తమ రాష్ట్రంలో కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కొనేందుకు హైడ్రా తరహాలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వారు వెల్లడించారు. అన్ని రాష్ట్రాలకు ఇలాంటి వ్యవస్థ ఎంతో అవసరమని వారు స్పష్టం చేశారు. ప్రారంభంలో కేవలం చెరువుల పరిరక్షణకే పరిమితమైన హైడ్రా, ప్రస్తుతం తన పరిధిని విస్తరించుకుని సమగ్రంగా పనిచేస్తున్న విషయం తెలిసిందే.

# కూకట్ పల్లిలో కల్తీకల్లు తాగి 13 మందికి అస్వస్థత

హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో కల్తీ కల్లు తాగి 13 మంది అస్వస్థతకు గురయ్యారు. జూలై 8న కల్తీకల్లు తాగిన 13 మంది వాంతులు,విరేచనాలు,లోబీపీతో బాధిలంతా కూకట్ పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. వీరిలో తొమ్మిది మంది పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వెంటనే ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఆరోగ్య శాఖ సిబ్బంది ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితులంతా హైదర్ నగర్, ఎల్లమ్మబండ, తదితర ప్రాంతాల్లో కల్తీ కల్లు సేవించటం వల్ల అనారోగ్యానికి గురైనట్లు గుర్తించారు. కల్తీ కల్లు వ్యవహారం కావడంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

# అమెరికాలో మరోసారి తుపాకుల మోత... ముగ్గురి మృతి

- అమెరికాలోని ఫిలడెల్ఫియాలో కాల్పుల ఘటన
- ఓ వీధిలో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి
- పది మందికి పైగా తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- మృతులు, క్షతగాత్రుల్లో టీనేజర్లు కూడా
- సీసీ కెమెరాలో రికార్డయిన కాల్పుల దృశ్యాలు



హైదరాబాద్ పెన్ పవర్:అమెరికాలో మరోసారి తుపాకుల మోత మోగింది. ఫిలడెల్ఫియాలోని గ్రేస్ ఫెర్రీ ప్రాంతంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన భారీ కాల్పుల ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, సౌత్ ఎటింగ్ స్ట్రీట్‌లో కొందరు వ్యక్తులు ఓ వీధిలో గుమిగూడారు. ఆ సమయంలో పలువురు దుండగులు ఒక్కసారిగా తుపాకులు బయటకు తీసి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. ఈ భయానక దృశ్యాలు అక్కడే ఉన్న ఓ సీసీ టీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది.
ఈ ఘటనలో జాసన్ రీస్ (19), జహీర్ వైలీ (23), అజిర్ హారిస్ (24) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిలో 15 ఏళ్ల బాలిక, ఇద్దరు 17 ఏళ్ల బాలురు కూడా ఉన్నారు. గాయపడిన వారిలో 19 ఏళ్ల యువకుడి పరిస్థితి విషమంగా ఉందని, మిగతా వారు కోలుకుంటున్నారని అధికారులు తెలిపారు. కాల్పుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో మరో వ్యక్తికి కూడా గాయాలయ్యాయి.
ఘటనపై ఫిలడెల్ఫియా పోలీస్ కమిషనర్ కెవిన్ బెథెల్ తీవ్రంగా స్పందించారు. "ఇది పిరికిపందల చర్య. అక్కడున్న ఇళ్లు, కార్లపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. తామేదో గూండాలమనుకునే వాళ్లు చేసే నీచమైన పని ఇది" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగిన సమయంలో పోలీసులు సమీపంలోనే ఉన్నారని, కాల్పుల శబ్దం విని వెంటనే అక్కడికి చేరుకున్నారని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పలువురు అనుమానితుల ఫొటోలను విడుదల చేసిన పోలీసులు, నిందితుల సమాచారం తెలిస్తే తెలియజేయాలని ప్రజలను కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# డీకే శివకుమార్ ముఖ్యమంత్రి కావడం ఖాయం: మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్ పెన్ పవర్:అధిష్ఠానం ఎంత సర్దిచెప్పినా కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి మార్పు వ్యవహారం సద్దుమణగడం లేదు. నాయకత్వ మార్పు ఉండదని పార్టీ హైకమాండ్ స్పష్టం చేసినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు మద్దతుగా ఎమ్మెల్యేలు ఒక్కొక్కరిగా గళం విప్పుతుండటంతో ఈ వివాదం మరోసారి భగ్గుమంది. డీకే శివకుమార్ తదుపరి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఆయనకు మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే సీపీ యోగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మంగళవారం నాడు యోగేశ్వర్ మాట్లాడుతూ "డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని చాలామంది ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారు. ఇది నా ఒక్కడి అభిప్రాయం కాదు, రాష్ట్ర ప్రజల ఆకాంక్ష కూడా ఇదే" అని అన్నారు. అయితే, తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం చేతిలోనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల పార్టీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా.. సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌లతో చర్చలు జరిపి, నాయకత్వ మార్పు ప్రసక్తే లేదని ప్రకటించారు.
అయితే, ఆ ప్రకటన వెలువడిన కొద్ది రోజులకే సోమవారం నాడు డీకే శివకుమార్ స్వయంగా తన మనసులోని మాటను బయటపెట్టారు. "ముఖ్యమంత్రి పదవిని ఆశించడంలో తప్పేముంది?" అని ఆయన ప్రశ్నించడం ఈ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. డీకే వ్యాఖ్యల తదనంతరం ఆయనకు మద్దతుగా ఎమ్మెల్యేలు ముందుకు రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

## బీజాపూర్ అడవుల్లో అటెన్షన్ .. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్ గా 25 వేల మందితో కూంబింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజాపూర్ అడవుల్లో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఆపరేషన్ కగార్ లో భాగంగా 20 వేల మంది భద్రతా సిబ్బంది నేషనల్ పార్క్ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతితోపాటు గెరిల్లా తంత్రాల్లో ఆరితేరిన పీఎల్‌జీ ఒకటో బెటాలియన్ కమాండర్ మాడ్వీ హిడ్మా, మరో అగ్రనేత దేవా టార్గెట్ గా మరో ఆపరేషన్ చేపట్టినట్టు తెలుస్తోంది. బీజాపూర్ లోని దండకారణ్యంలో నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో 25 వేల బలగాలను మోహరించారని తెలుస్తోంది. పోలీసు బలగాలు మొత్తం ఆ ప్రాంతంపై పట్టు సాధించాయని చెబుతున్నారు. అలానే నిన్న మధ్యాహ్నం జరిగిన స్వల్ప ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత సోంది కన్నా మృతి చెందారు. ఈ నేపథ్యంలో బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లొంగి పోతారా.. లేదంటే ఎన్‌కౌంటరై పోతారా అంటూ మావోయిస్టులకు ఆయన హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. ఈ కూంబింగ్ విషయంపై పౌర హక్కుల నేతల ఆందోళనలు కూడా దీనికి పరోక్షంగానే అవుననే సమాధానం చెబుతున్నాయి. నేషనల్‌పార్క్ ఆపరేషన్‌ను వెంటనే ఆపేయాలని తెలంగాణ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు. దీంతో ఏ క్షణమైనా ఎన్ కౌంటర్ జరగొచ్చని పౌరహక్కుల నేతలు టెన్షన్ పడుతున్నారు

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిని కలిసిన మంద కృష్ణ మాదిగ!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్లను పెంచకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్రంగా విమర్శించారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణకు సిద్ధమైనట్లు ఆయన ప్రకటించారు. హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్‌లో 'ఛలో దివ్యాంగుల మహాగర్జన' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావును కలిసి తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ, దివ్యాంగుల సమస్యలపై ప్రతిపక్షాలు కూడా సరిగా స్పందించకపోవడం వల్లే తాము ప్రత్యక్ష పోరాటానికి దిగుతున్నామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి మద్దతు కోరుతున్నట్లు వివరించారు. 'మహాగర్జన'కు సన్నాహకంగా ఈ నెల 13 నుంచి అన్ని జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే హామీ ఇచ్చిందో అదే ఎల్బీ స్టేడియంలో మహాగర్జన సభ పెట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తామని అన్నారు. దీంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికలలో దివ్యాంగులకు రాజకీయంగా అవకాశం కల్పించేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సీఎంను గోకుడెందుకు..?తన్నిపిచ్చుకోవడమెందుకు.?: జగ్గారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎంతో చర్చించే స్థాయి కేటీఆర్ కు లేదన్నారు. కేటీఆర్ ఒక్క బూతు మాట మాట్లాడితే సీఎం పది తిట్లు తిడతారని అన్నారు. సీఎంను గోకడమెందుకు..?తన్నిపిచ్చుకోవడమెందుకని ప్రశ్నించారు జగ్గారెడ్డి. కేటీఆర్ చిన్నపిల్లల మాదిరి మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు తిడితే పడేవారు ఎవరూ లేరన్నారు. కేటీఆర్ ఒకటి అంటే పది మాటలంటామని ఇందులో కాంప్రమైజ్ అయ్యే పరిస్థితే లేదన్నారు జగ్గారెడ్డి.

జులై 8న గాంధీభవన్ లో మాట్లాడిన జగ్గారెడ్డి.. ఈ మధ్య కేటీఆర్ తెలంగాణలో ఉండటం లేదు. నెలకోసారి విదేశాలకు వెళ్తున్నారు. నెలకు 20 రోజులు కేటీఆర్ విదేశాల్లోనే గడుపుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కేటీఆర్ కు బహుశా తెల్వదు. రాష్ట్ర హక్కులను కాపాడేందుకే రేవంత్ ఢిల్లీకి వెళ్తున్నారు. పదేండ్లు పాలించిన కేసీఆర్ ఏనాడైనా కేంద్రం దగ్గరకు వెళ్లారా?. కేటీఆర్ తీరు చిన్న పిల్లల మాదిరి ఉంది. మీరు మాట్లాడేదాన్ని బట్టే మా తీరు ఉంటుంది.



సీఎంతో చర్చించే స్థాయి కేటీఆర్ కు లేదు. సీఎంను గోకుడెందుకు..తన్నిపిచ్చుకోవడం ఎందుకు .?. కేటీఆర్ సర్పంచ్ గా గెలిచారా? జడ్పీటీసీగా గెలాచారా?. కేటీఆర్ కు డక్కాముక్కీలు ఎలా తెలుస్తయ్. వాళ్ల నాన్న సీటు ఇస్తే డైరెక్ట్ ఎమ్మెల్యే అయ్యాడు. మేం ఎన్నో వ్యయప్రయాసలతో రాజకీయ నేతలం అయ్యాం. అనుభవంతో కూడిన రాజకీయం మాది. మా అనుభవం ముందు కేటీఆర్ జీరో. మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు కేటీఆర్ కు లేదు.

కేటీఆర్ ఒకటి అంటే మే పది మాటలంటాం. గాడిదలంటే పడేవాళ్లు ఎవరూ లేరిక్కడ. ఐదేళ్లు పాలించాలని ప్రజలు మాకు అవకాశం కల్పించారు. ప్రజాపాలన అందించాలనేదే మా లక్ష్యం. మీరు ఒక్క తిట్టుతిడితే సీఎం పది బూతులు తిడతాడు. ఇందులో కాంప్రమైజ్ అయ్యేదే లేదు . కేటీఆర్ కవిత దెబ్బలకు తట్టుకోలేకపోతున్నారు. 18 నెలలుగా అధికారం లేకపోయేసరికి కేటీఆర్ ఒడ్డున పడ్డ చేపలా కొట్టుకుంటుండు అని అన్నారు.

## రానున్న రెండు రోజులు అతి భారీ వర్షాలేనట.. హై అలెర్ట్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అల్పపీడనద్రోణి ఫలితంగా ఈ నెల పదో తేదీ వరకూ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ చెప్పింది. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది. అనేక ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసే అవకాశముందని కూడా వాతావరణ శాఖ హెచ్చరించింది. అధికారుల కూడా అప్రమత్తంగా ఉండాలని అలెర్ట్ చేసింది.




### ఈ నెల పదో తేదీ వరకూ...

ప్రధానంగా తెలంగాణలో ఈ నెల పదో తేదీ వరకూ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లోల ఈరోజు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. దాదాపు పది జిల్లాలకు పైగానే వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ ను జారీ చేయడంతో అధికార యంత్రాంగం కూడా అప్రమత్తమయింది. పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నిజామాబాద్, నిర్మల్, మంచిర్యాల,కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో భారీ వర్షం పడుతుందని తెలిపింది.

### ఈ ప్రాంతాల్లో అతి భారీవర్షాలు...

ఆంధ్రప్రదేశ్ లోనూ రెండు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తరకోస్తా జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు గంటకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా ప్రాంతంలోనూ ఇదే రకమైన పరిస్థితి ఉంటుందని తెలిపింది. రాయలసీమలో మాత్రం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముందని చెప్పింది.

# ఫోన్, బైక్, ట్రాక్టర్... దొంగల నుంచి ఎమ్మెల్యేకు వరుస షాకులు!



**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణంగా ఎమ్మెల్యే ఇల్లు అంటే.. అక్కడ ఎప్పుడూ సందడిగానే ఉంటుంది. నిత్యం వచ్చే వాళ్లు, వెళ్లేవాళ్లతో కాస్త హడావిడిగానే ఉంటుంది. ఇక సెక్యూరిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కొంతమందికైతే ప్రభుత్వ భద్రతతో పాటు ప్రైవేటు భద్రతా ఉంటుంది. అలాంటి ఓ ఎమ్మెల్యే ఇంటిని దొంగలు టార్గెట్ చేశారు. నెల రోజుల వ్యవధిలోనే మూడుసార్లు దొంగతనం చేసి షాకిచ్చారు!

అవును... రాజస్థాన్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేత దీన్ దయాల్ బైర్వా.. దౌసా నిజయోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఆయనను దొంగలు వరుసగా టార్గెట్ చేస్తున్నారు. ఇందులో భాగంగా... జూన్ 11న దౌసాలో మాజీ కేంద్ర మంత్రి రాజేశ్ పైలట్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ఫోన్ కొట్టేశారు. అక్కడితో ఆయనకు షాకులు ఆగలేదు. ఫోన్ పోయిన తర్వాత కొన్ని రోజులకు ఆయన ఇంటి నుంచి మోటార్ సైకిల్ ఎత్తుకెళ్లిపోయారు. ఇదే క్రమంలో తాజాగా సోమవారం రాత్రి మళ్లీ ఆయన ఇంటి నుంచే ట్రాక్టర్ ట్రాలీ దొంగతనానికి గురైంది. ఇలా వరుసగా చోరీలు జరుగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఆయన వరుస షాకులతో ఇబ్బంది పడుతున్నారు.

ఇదే సమయంలో... పోలీసులను నిలదీస్తూ, ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ఇందులో భాగంగా.. ఎమ్మెల్యేగా ఉన్న తనకే రక్షణ లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని పోలీసులను నిలదీసిన ఆయన... గతంలో ఎప్పుడూ తనకు ఇలాంటి పరిస్థితి రాలేదని.. కానీ ఇప్పుడు వరుసగా మూడు దొంగతనాలు జరిగాయని తెలిపారు.

అయితే... ఇంట్లో టూ వీలర్ పోయినప్పుడు సీసీ కెమెరా పనిచేయ లేదని.. నిర్మాణ పనుల నిమిత్తం కెమెరాలను తొలగించామని.. తాజాగా రాత్రి ట్రాలీ పోయిందని అన్నారు. ఈ సందర్భంగా స్పందించిన అసెంబ్లీలో ప్రతిపక్షనేత టికారామ్... ఈ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు కూడా సురక్షితంగా లేరంటూ ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. మరోవైపు ఈ ఘటనలపై దౌసా ఎస్పీ సాగర్ స్పందించారు. ఈ సందర్భంగా... ట్రాలీ దొంగతనం విషయంలో తమకు ఇంతవరకు ఫిర్యాదు అందలేదనే.. మొబైల్ ఫోన్ చోరీ కేసులో మాత్రం ఎఫ్.ఐ.ఆర్ నమోదైందని తెలిపారు.

# విజయమ్మను కౌగిలించుకున్న జగన్... మాట్లాడుకోలేదు ఎందుకు?



**హైదరాబాద్ పెన్ పవర్:**గత కొంతకాలంగా మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కు.. తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మతో మంచి సంబంధాలు లేవనే సంగతి తెలిసిందే. విజయమ్మకు గతంలో కేటాయించిన వాటాలను తిరిగి పొందాలని కోరుతూ ఆయన ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేయడం, దీనికి ఆమె నుంచి కౌంటర్ రావడం జరిగింది! ఆ విధంగా ప్రస్తుతం కుటుంబ సభ్యుల మధ్య చాలా గ్యాప్ వచ్చేసిందని చెబుతున్నారు!

ఒకానొక సమయంలో అయితే వ్యవహారం పూర్తిగా పబ్లిక్ అయిపోయింది! షర్మిల అయితే జగన్ ను నేరుగానే టార్గెట్ చేస్తున్నారు.. బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరోవైపు విజయమ్మకు జగన్ కు మధ్య ప్రస్తుతం ఎలాంటి పరిస్థితి ఉందనే విషయంపై పూర్తి స్పష్టత లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు తాజాగా కలుసుకున్నారు.. ఆలింగనం చేసుకున్నారు! అయితే... అక్కడ ఉన్నంత సేపు ఇద్దరి మధ్య మాటలు కనిపించలేదు!

అవును... ఈరోజు దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి సందర్భంగా.. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద జగన్, విజయమ్మ నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వీరితోపాటు వైఎస్ భారతి, ఇతర కుటుంబ సభ్యులు, వైసీపీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా... జగన్, విజయమ్మ ఆలింగనం చేసుకున్నారు!

అయితే ఇక్కడ ఆసక్తికర విషయం ఏమిటంటే.. వారు దగ్గరగా ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు ఒక్క మాట కూడా మాట్లాడుకొన్నట్లు కనిపించలేదు! దీంతో... ఈ నిశ్శబ్ద సంభాషణ వారి మధ్య ఉన్న గ్యాప్ ను, దెబ్బతిన్న సంబంధాలను ప్రతిబింబిస్తుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి!

మరోవైపు అక్కడి వాతావరణం అంతా తీవ్ర భావోద్వేగం మధ్య ఉండటంతో.. మాటాడుకోలేకపోయి ఉండొచ్చు అని మరికొంతమంది

స్పందిస్తున్నారు. ఏది ఎమైనా.. వీరి మధ్య బంధం అప్పటిలా లేదనే వాదనకు తాజా సంఘటన ఒక నిదర్శనం అనే మాటలు వినిపిస్తుండటం గమనార్హం!మరోవైపు... వైఎస్సార్ 76వ జయంతి సందర్భంగా విజయమ్మతో కలిసి షర్మిల కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు కేక్ తినిపించుకోగా.. షర్మిలను విజయమ్మ ఆప్యాయంగా ముద్దాడారు!

# భారతీయులపై బ్రిటిష్ మహిళ ఖండకావరం!



**హైదరాబాద్ పెన్ పవర్:**లండన్‌లోని అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన హీథ్రూ విమానాశ్రయం ప్రస్తుతం ఒక పెద్ద వివాదానికి కేంద్రంగా మారింది. బ్రిటన్‌కు చెందిన లూసీ వైట్ అనే మహిళా ప్రయాణికురాలు చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. హీథ్రూ విమానాశ్రయంలో పనిచేసే సిబ్బందిపై ఆమె చేసిన జాత్యహంకార వ్యాఖ్యలు నెటిజన్ల ఆగ్రహానికి దారితీశాయి.

### లూసీ వైట్ చేసిన ఆరోపణలు

సోమవారం 'ఎక్స్' లో లూసీ వైట్ ఒక పోస్ట్ చేశారు. అందులో ఆమె "లండన్‌లోని హీథ్రూ విమానాశ్రయంలో దిగాను. అక్కడ సిబ్బందిలో ఎక్కువమంది భారత్, ఆసియా దేశాలకు చెందినవారు. వారు ఆంగ్లం మాట్లాడలేరు. ఇంగ్లీషులో మాట్లాడమని అడిగితే నా మీదే జాత్యహంకారపు ముద్ర వేయాలన్నారు" అని పేర్కొన్నారు. అంతేకాకుండా "ఇలా ఆంగ్లం రాని వారిని సిబ్బందిగా ఉంచడం వల్ల విదేశీ పర్యాటకులు ఇబ్బంది పడతారు. ఇలాంటి వారిని దేశం నుంచి బహిష్కరించాలి" అని ఆమె వ్యాఖ్యానించారు.

### నెటిజన్ల తీవ్ర విమర్శలు

లూసీ వైట్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. చాలా మంది ఆమెను జాత్యహంకారి అని ఆరోపించారు. ఒక నెటిజన్ సూటిగా ప్రశ్నిస్తూ "మీరు హిందీ మాట్లాడగలరా? వాళ్లు ఆంగ్లం మాట్లాడలేకపోతే మీరు ఎలా అర్థం చేసుకున్నారు?" అని అడిగారు. మరో నెటిజన్ వ్యాఖ్యానిస్తూ "హీథ్రూలో సిబ్బంది ఎక్కువమంది ఆసియా సంతతివారే అయినా, వారందరూ మంచి ఆంగ్ల నైపుణ్యంతోనే పనిచేస్తున్నారు. మీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం" అన్నారు.

### వివాదం వేడెక్కించిన అంశాలు

ఈ వివాదంతో భాషా నైపుణ్యాలు, విమానాశ్రయ సిబ్బంది ఎంపిక, విదేశీయుల పట్ల దురాభిప్రాయాలు, జాత్యహంకార భావజాలం వంటి అంశాలపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. కొంతమంది లూసీ వ్యాఖ్యలకు మద్దతుగా నిలుస్తున్నా, ఆమెపై భారీగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ వాతావరణంలో, ముఖ్యంగా విమానాశ్రయాల్లో భాష, జాతి, సంస్కృతి తేడాలు సహజం. ఇలాంటి సందర్భాల్లో సహనశీలత, సమగ్ర భావన అవసరం. లూసీ వైట్ చేసిన వ్యాఖ్యలు ఈ విషయంలో ఒక హెచ్చరికగా నిలుస్తున్నాయి. ప్రజలు ఆన్‌లైన్ వేదికలపై అభిప్రాయాలు వ్యక్తం చేసే ముందు, సమాజంపై కలిగే ప్రభావాన్ని ఆలోచించాల్సిన అవసరం ఉంది.

# నీటి కరువుతో కాబూల్..2030 నాటికి మోడరన్ సిటీ ఎడారిగా మారే ప్రమాదం!



**హైదరాబాద్ పెన్ పవర్:**కాబూల్.. ఆఫ్ఘనిస్తాన్ రాజధాని..మోడరన్ సిటీ..ఇప్పుడు అత్యంత భయంకరరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అదే నీటి కొరత..గత కొన్నేళ్లుగా అడుగంటిన భూగర్భజలాలు, రోజురోజుకు దిగజారుతున్న వాతావరణ పరిస్థితులు..ఈ ధోరణి ఇలా కొనసాగితే 60లక్షల ప్రజలున్న కాబూల్ నగరం..రాబోయే ఐదేళ్లలో కాబూల్ ప్రపంచంలోనే నీరులేక ఎడారిగా మారనుంది. నీరులేక అల్లాడే తొలి ఆధునిక నగరంగా మారే ప్రమాదం ఉంది. వివరాల్లోకి వెళితే..

అంతర్జాతీయ సహాయ సంస్థ మెర్సీ కార్ప్స్ కొత్త నివేదిక ప్రకారం.. కాబూల్ ప్రపంచంలోనే నీటి కొరత ఉన్న మొట్టమొదటి ఆధునిక నగరంగా మారే సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాదాపు ఆరు మిలియన్ల మందికి నివాసంగా ఉన్న ఆఫ్ఘన్ రాజధానిలో అత్యవసర చర్యలు తీసుకోకపోతే 2030 నాటికి దాని జలాశయాలు ఎండిపోయే ప్రమాదం ఉంది.

ఈ భయంకరమైన హెచ్చరిక కేవలం సైద్ధాంతికం మాత్రమే కాదు.. కొన్నేళ్లుగా తగ్గుతున్న భూగర్భ జల మట్టాలు, పెరుగుతున్న డిమాండ్ ,దిగజారుతున్న వాతావరణ పరిస్థితులు ఈ పరిస్థితికి కారణం అవుతున్నాయి. ఈ నీటి సంక్షోభం ఇలాగే కొనసాగితే మూడు మిలియన్ల మంది నివాసితులు తిండి, నీరు లేక మలమలమాడే పరిస్థితి వస్తుందని, ఆధునిక కాలంలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా మానవ పతనానికి దారితీస్తుందని నిపుణులు అంటున్నారు.

కాబూల్‌లో నీరు ఎందుకు అయిపోతోంది?

వాతావరణ మార్పు, దశాబ్దాల యుద్ధం, వేగవంతమైన జనాభా పెరుగుదల,పాలనా వైఫల్యాల వంటి పరిస్థితులతో కాబూల్ లో ఈ సంక్షోభం తలెత్తింది. గత దశాబ్దంలో భూగర్భజల మట్టాలు 30 మీటర్ల వరకు పడిపోయాయని మెర్సీ కార్ప్స్ నివేదిక చెబుతోంది. కాబూల్ నగరానికి ప్రధాన తాగునీటి వనరు అయిన కాబూల్‌లోని దాదాపు సగం బోర్‌హోల్స్ ఇప్పటికే ఎండిపోయాయి. నివాసితులు నీరు లేక ఇప్పటికే అనేక అవస్థలు పడుతున్నారు. చాలామంది ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు, వారి ఆదాయంలో 30శాతం వరకు నీటికోసమే ఖర్చు చేస్తున్నారు. మెర్సీ కార్ప్స్ ప్రకారం.. కాబూల్ జనాభాలో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మంది నీటి సంబంధిత అప్పుల్లో ఉన్నారు.

**కాబూల్ నీటి సంక్షోభానికి కారణాలు**

అధిక జనాభా పెరుగుదల ,పట్టణీకరణ.. ఒక కారణంగా చెప్పొచ్చు. 2001లో కేవలం 10లక్షల మంది ఉన్న కాబూల్ జనాభా ఇప్పుడు 6-7 లక్షలకు చేరుకుంది. ఈ భారీ జనాభా పెరుగుదల నగర నీటి సరఫరా వ్యవస్థపై విపరీతమైన ఒత్తిడిని తెచ్చింది.

భూగర్భజలాల విపరీత వినియోగం.. కాబూల్ ప్రధానంగా భూగర్భజలాలపై ఆధారపడుతుంది. గత దశాబ్దంలో భూగర్భజలాల స్థాయిలు 25నుంచి -30 మీటర్లు (82నుంచి -98 అడుగులు) పడిపోయాయి. ప్రతి యేటా భూగర్భజలాలు సహజంగా పునరుత్పత్తి అయ్యే దానికంటే 44 మిలియన్ క్యూబిక్ మీటర్లు ఎక్కువగా వినియోగిస్తున్నారు. నగరంలోని సుమారు 120,000 పైగా అక్రమ బోర్‌వెల్స్, వందలాది కర్మాగారాలు, గ్రీన్‌హౌస్‌లు ఈ భూగర్భజలాలను విపరీతంగా తోడేస్తున్నాయి.

శీతోష్ణస్థితి మార్పు: ఆఫ్ఘనిస్తాన్ శీతోష్ణస్థితి మార్పుల ప్రభావానికి గురవుతున్న ఆరో అత్యంత బలహీనమైన దేశం. హిందూకుష్ పర్వతాల నుంచి వచ్చే మంచు ,హిమానీనదాల కరిగి కాబూల్ నది, దాని ఉపనదులకు నీరందిస్తున్నాయి. అయితే తగ్గిన మంచు,తక్కువ వింటర్ నీటి లభ్యతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

**నీటి కాలుష్యం:** కాబూల్‌లోని భూగర్భజలాల్లో 80శాతం వరకు మురుగునీరు, విష పదార్థాలు, అధిక స్థాయి ఆర్సెనిక్ ,లవణాలతో కలుషితమై ఉన్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఇది ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదాన్ని కలిగిస్తుంది.

**బోర్‌వెల్స్ ఎండిపోవడం:** UNICEF అంచనాల ప్రకారం..కాబూల్‌లోని భూగర్భ బోర్‌వెల్స్‌లో దాదాపు సగం ఇప్పటికే ఎండిపోయాయి. ఇవి చాలా మంది నివాసితులకు ప్రాథమిక తాగునీటి వనరులు అందడం లేదు.

**నీటి కొరత సంక్షోభం కొనసాగితే..**

ప్రస్తుత ధోరణి కొనసాగితే 2030 నాటికి కాబూల్ భూగర్భజల వనరులు పూర్తిగా ఎండిపోనున్నాయని రిపోర్టులు చెబుతున్నాయి. ఇది దాదాపు 30లక్షల మంది ఆఫ్ఘన్ ప్రజలను ప్రాంతం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ఇది మానవతా ,వలస సంక్షోభాన్ని సృష్టిస్తుంది.

ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేకుండా పోతుంది. ఎందుకంటే సంపన్న నివాసితులు లోతైన బోర్‌వెల్‌లను తవ్వగలుగుతారు.ఇది పేదల నీటి లభ్యతను మరింత పరిమితం చేస్తుంది.


పరిష్కారం ఉందా?..

నియంత్రణ చర్యలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, నీటి సంరక్షణ పద్ధతులు ,ప్రత్యామ్నాయ నీటి వనరుల అభివృద్ధి వంటివి సమగ్ర నీటి వనరుల నిర్వహణ పద్ధతులను అమలు చేయడం ద్వారా భూగర్భజలాలపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు సాయపడొచ్చం టున్నారు నిపుణులు. నీటి సంరక్షణ ,సమర్థవంతమైన నీటిపారుదల పద్ధతుల ద్వారా నీటిని పొదుపుగా వాడటం ,ఆధునిక నీటిపారుదల పద్ధతులను అవలంబించడం చాలా ముఖ్యమంటున్నారు. వర్షపు నీటిని సేకరించి భూగర్భజలాలను తిరిగి నింపే కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందంటున్నారు.

కాబూల్ నీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అంతర్జాతీయ సమాజం నుంచి తక్షణ, సమన్వయ జోక్యం, నిధులు అవసరం అని నిపుణులు చెబుతున్నారు. నీటి వనరుల సమర్థవంతమైన నిర్వహణకు పటిష్టమైన పాలన ,నియంత్రణ చట్టాలు అవసరమంటున్నారు. పంచశీర్ నది పైప్‌లైన్, షా తూత్ ఆనకట్ట వంటి దీర్ఘకాలికంగా ప్రణాళిక చేయబడిన ప్రాజెక్టులను పూర్తి చేయడం అవసరం ఉందంటున్నారు.

కాబూల్ ఎదుర్కొంటున్న ఈ నీటి సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా నగరాలు ఎదుర్కొనే సవాళ్లకు ఒక సూచనగా చెప్పొచ్చు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోకపోతే అది తీవ్రమై మానవతా విపత్తుకు దారితీస్తుందని నిపుణులు, రిపోర్టులు చెబుతున్నాయి.

# అంతరిక్షంలోకి వెళ్లాల్సిన అస్థికలు.. సముద్రగర్భంలోకి..




**హైదరాబాద్ పెన్ పవర్:**అంతరిక్షాన్ని మానవ స్మృతులకు స్వర్గధామంగా మార్చాలనే గొప్ప ఆశయంతో చేపట్టిన ఒక వినూత్న అంతరిక్ష ప్రయోగం విషాదకరంగా ముగిసింది. ప్రేమతో, గౌరవంతో తమ ప్రియమైనవారి జ్ఞాపకాలను చిరంజీవిగా ఉంచాలని కోరుకున్న 166 మంది మృతుల అస్థికలను అంతరిక్షంలోకి పంపిన 'మిషన్ ఇంపాజిబుల్' ఒక చేదు అనుభవాన్ని మిగిల్చింది. చివరి క్షణాల్లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగా స్పేస్ క్యాప్సుల్ భూమికి తిరిగి చేరకముందే పసిఫిక్ మహాసముద్రంలో కూలిపోయింది. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా విషాదాన్ని నింపింది.

**వినూత్న ప్రయత్నం... కానీ విషాదాంతం**

జర్మనీకి చెందిన స్టార్టప్ సంస్థ 'ది ఎక్స్‌ప్లొరేషన్ కంపెనీ' అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన సెలెస్టిస్ అనే స్పేస్ బరియల్ కంపెనీతో కలిసి ఈ 'మిషన్ ఇంపాజిబుల్'ను ప్రారంభించింది. జూన్ 23న ఎన్‌వైఎక్స్ (%బీఇఞ%) పేరుతో అభివృద్ధి చేసిన స్పేస్ క్యాప్సుల్‌ను భూమి గుండా ప్రయోగించారు. ఈ క్యాప్సుల్‌లో 166 మంది మృతుల అస్థికలు, డీఎన్ఏ నమూనాలు, విత్తనాలు, ఇతర స్మృతిచిహ్నాలను ఉంచారు. భూమిని పలుమార్లు చుట్టి తిరిగి భూ వాతావరణంలోకి సురక్షితంగా ప్రవేశించి, సురక్షితంగా వెనక్కి వచ్చేలా ఈ స్పేస్ క్యాప్సుల్‌ను డిజైన్ చేశారు.

**రెండుసార్లు విజయవంతం... మూడోసారి వైఫల్యం**

ఈ ప్రయోగం మొదటి దశ అద్భుతంగా సాగింది. క్యాప్సుల్ భూమిని రెండు సార్లు విజయవంతంగా చుట్టి వచ్చింది. అయితే, మూడవ సారి భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించే సమయంలో ఊహించని సమస్య తలెత్తింది. మిషన్ కంట్రోల్ కేంద్రంతో స్పేస్ క్యాప్సుల్ సంబంధాలను కోల్పోయింది. తక్కువ సమయంలోనే క్యాప్సుల్ పసిఫిక్ మహాసముద్రంలో కూలిపోయినట్లు కంపెనీ ప్రకటించింది.

**కంపెనీ స్పందన**

ఈ దురదృష్టకర ఘటనపై 'ది ఎక్స్‌ప్లొరేషన్ కంపెనీ' స్పందించింది. బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని, క్షమాపణలను తెలియజేసింది. "మా ప్రయోగం వినూత్న లక్ష్యాలతో ముందుకు సాగింది. ప్రారంభ దశలో విజయవంతమైంది. అయితే చివర్లో తలెత్తిన సమస్య వల్ల పూర్తి విజయాన్ని సాధించలేకపోయాం. ఈ ప్రమాదంతో మొత్తం అస్థికలు సముద్రంలో కలిసిపోయాయి. వాటిని తిరిగి పొందడం అసాధ్యం. అయినా ఈ చారిత్రక ప్రయోగంలో భాగమయ్యారన్న గౌరవం బాధిత కుటుంబాలకు ఎప్పుడూ ఉంటుంది" అని పేర్కొంది.

**భవిష్యత్ ప్రయోగాలకు బలమైన పాఠం**

ఈ వైఫల్యం భవిష్యత్తులో అంతరిక్ష శవ దహనాలు చేపట్టే సంస్థలకు ఒక బలమైన పాఠంగా నిలవనుంది. మానవ జ్ఞాపకాలను అంతరిక్షం వరకు తీసుకెళ్లే ఈ కొత్త విభాగం విజయవంతం కావాలంటే మరింత శాస్త్రీయత, పటిష్టమైన జాగ్రత్తలు అవసరమని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది.

సాంకేతిక విజ్ఞానం ఎంత పురోగమించినా... మానవ భావోద్వేగాలను సురక్షితంగా మోసుకెళ్లడం మాత్రం ఇప్పటికీ ఒక పెద్ద సవాలే!

## ఇటలీ ఎయిర్‌పోర్ట్‌లో ఘోరం.. విమానం ఇంజిన్‌లో చిక్కుకుని వ్యక్తి దుర్మరణం




**హైదరాబాద్ పెన్ పవర్:**ఇటలీలోని మిలాన్ బెర్గామో విమానాశ్రయంలో విషాదకర సంఘటన చోటు చేసుకుంది. విమానాశ్రయ భద్రతా వలయాన్ని దాటుకొని రన్‌వేపైకి ప్రవేశించిన ఒక వ్యక్తి, అక్కడ సిద్ధంగా ఉన్న విమానం ఇంజిన్‌లో చిక్కుకుని మరణించాడు. ఈ ఘటన మంగళవారం జరగగా, స్థానికంగా కలకలం రేపింది.విమానాశ్రయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సుమారు 35 సంవత్సరాల వయస్సు గల ఒక వ్యక్తి తన వాహనాన్ని విమానాశ్రయం వెలుపల వదిలి లోపలికి ప్రవేశించాడు. భద్రతా సిబ్బంది కళ్లు గప్పి, విమానాల పార్కింగ్ జోన్‌కు వెళ్లే అత్యవసర ద్వారాన్ని బలవంతంగా తెరిచి రన్‌వే వైపు పరుగెత్తాడు. అదే సమయంలో టేకాఫ్‌కు సిద్ధమవుతున్న ఎయిర్‌బస్ ఏ319 విమానం సమీపానికి చేరుకున్నాడు. వేగంగా తిరుగుతున్న ఇంజిన్ అతడిని బలంగా లోపలికి లాగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఇంజిన్‌ను ఆపివేసి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ దుర్ఘటన కారణంగా విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు కొద్ది గంటలపాటు అంతరాయం కలిగింది. మృతుడు ఆత్మహత్య చేసుకునేందుకే ఈ చర్యకు పాల్పడ్డాడా, లేక దీని వెనుక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు అని అధికారులు తెలిపారు.

## హైదరాబాద్‌లో ముగిసిన బాంబు స్క్వాడ్ తనిఖీలు.. ఊపిరి పీల్చుకున్న నగరవాసులు!




**హైదరాబాద్ పెన్ పవర్:**మంగళవారం హైదరాబాద్ నగరంలో తీవ్ర కలకలం రేగింది. నగరంలోని సిటీ సివిల్ కోర్టు, జడ్జి ఛాంబర్స్, జింఖానా క్లబ్, రాజ్‌భవన్ వంటి నాలుగు కీలక ప్రాంతాల్లో బాంబులు పెట్టామంటూ వచ్చిన ఈ-మెయిల్స్ పెను సంచలనం సృష్టించాయి. ఈ బెదిరింపులతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే రంగంలోకి దిగి గంటల తరబడి సోదాలు నిర్వహించారు.'అబీదా అబ్దుల్లా' అనే పేరుతో ఉన్న ఈ-మెయిల్ ఐడీ నుంచి ఈ బెదిరింపు సందేశాలు వచ్చాయి. సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్‌లలో ఆర్‌డీఎక్స్, ఐఈడీ వంటి శక్తివంతమైన పేలుడు పదార్థాలు అమర్చామని, అవి కొద్దిసేపట్లో పేలిపోతాయని మెయిల్‌లో హెచ్చరించారు. దీంతో అధికారులు వెంటనే కోర్టు కార్యకలాపాలను నిలిపివేసి, న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను ప్రాంగణం నుంచి ఖాళీ చేయించారు.సమాచారం అందుకున్న బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు హుటాహుటిన బెదిరింపులు వచ్చిన అన్ని ప్రాంతాలకు చేరుకున్నాయి. సుమారు మూడు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాయి. ఈ సోదాల్లో ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో బెదిరింపులు బూటకమని నిర్ధారించారు. దీంతో అధికారులు, నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, బెదిరింపు మెయిల్స్ పంపిన వారిని గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# వైఎస్సార్ కి తెలిసింది అదే !



**హైదరాబాద్ పెన్ పవర్:**మహా నేతగా ప్రజల గుండెలలో శాశ్వతమైన స్థానాన్ని వైఎస్సార్ సంపాదించుకున్నారు. ఆయన అనేక పర్యాయాలు ముఖ్యమంత్రి కాలేదు. రెండే రెండు సార్లు ఆ పీఠం అధిరోహించారు టోటల్ గా లెక్క కడితే అక్షరాలా అయిదేళ్ల మూడు నెలలు మాత్రమే ఆయన ముఖ్యమంత్రిగా పనిచేశారు. కానీ చరిత్రలో నిలిచి పోయారు. తరగని ఆస్తిగా మంచి పేరు సంపాదించుకున్నారు.

ఆయన పేదల గురించి ఆలోచన చేసినట్లుగా వేరెవరూ చేయలేదు. పేదవారు ప్రాథమిక అవసరాలు అయిన విద్య వైద్యం విషయంలో విప్లవాత్మకైన నిర్ణయాలు ఆయన తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ ఆయన మానసపుత్రికగా రూపు దిద్దుకుంది. అంతే కాదు పేదవారు కూడా పెద్ద చదువులు చదువుకోవాలని తపించి ఆయన అమలు చేసిన ఫీజు రీయింబర్స్మెంట్ పథకం ద్వారా ఈ రోజున ప్రతీ బీద కుటుంబమూ బాగుపడింది. ఆ కుటుంబంలో నవ్వులు విరబూసాయి.వీటితో పాటు అనేక ఇతర పథకాలు ఆయన పాలనలో గుర్తుకు వస్తాయి. ముఖ్యంగా రైతన్నల కోసం ఆయన చేసినట్లుగా ఎవరూ చేయలేదని ఈ రోజుకీ చెప్పుకుంటారు. ఉచిత విద్యుత్ రైతులకు అందించడం ఒక సాహసోపేతమైన నిర్ణయం. దానిని సక్రమంగా అమలు చేసిన ఘనత వైఎస్సార్ కే దక్కుతుంది. వీటితో పాటుగా ఒక నాయకుడు ఎలా ఉండాలో వైఎస్సార్ నిలువెత్తు ఉదాహరణగా కనిపిస్తారు. ముఖ్యమంత్రిగా ఉంటూ ప్రజా దర్బార్ లను ఆయన నిర్వహించారు. తన ఇంటికి వచ్చిన వారికి లేదనకుండా కాదనకుండా పరిష్కారాలు చూపించారు

ఆయన జిల్లా పర్యటనకు వస్తున్నారు అంటే చాలు అక్కడ వరాల మోత మోగాల్సిందే. అలా చేతికి ఎముక లేదు అన్నట్లుగా ఆయన ప్రజల కోసం అనేక రకాలుగా కార్యక్రమాలు చేసి చూపించారు. ఆయనలో గొప్ప మానవతావాది ఉన్నారు. ఆయన అందరి వాడుగా మారేందుకు అదే కారణం.ఇక తన పాదయాత్ర తరువాత వచ్చిన కీలక మార్పు గురించి ఆయన చెబుతూ కోపం నరాన్ని తాను తెంపేసుకున్నాను అని చెప్పారు. ఆ మాట అక్షర సత్యమైంది. ఆయన అలాగే చివరి వరకూ స్వచ్ఛమైన నవ్వుతోనే ఉంటూ వచ్చారు. ఆయన ఉంటే అసెంబ్లీకి నిండు తనం వచ్చేది. ఏ అంశం మీద అయినా సాధికారికంగా ఆయన మాట్లాడినా సభ మొత్తమే కాదు టీవీల ముందు కూర్చున్న జనాలు కూడా నిశ్శబ్దంగా అంతా వినేవారు.విపక్షంలో ఉన్న సభ్యులు ఆవేశకావేశాలు చూపించినా ఆయన చిరు నవ్వుతోనే పంచులేసేవారు. ఇక ముఖ్యమంత్రిగా వైఎస్సార్ అపొజిషన్ లో బాబు ఉన్న ఆనాటి సభని చూసేందుకు అంతా ఇష్టపడేవారు. ఒక బ్లాక్ బస్టర్ మూవీకి వచ్చే టీఆర్పీ రేటింగ్ ఆనాటి అసెంబ్లీ సెషన్లకు వచ్చేది. మరో వైపు చూస్తే వైఎస్సార్ రాజకీయాల్లో అజేయుడిగా నిలిచారు. ప్రజా వైద్యుడిగా వృత్తిగత జీవితాన్ని ప్రారంభించిన ఆయన రాజకీయాల్లోకి అనూహ్యంగా వచ్చారు. 1978లో కడప జిల్లా పులివెందుల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఇక వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఈ సుదీర్ఘమైన రాజకీయ ప్రస్థానంలో ఆయన మూడు సార్లు ఎంపీ అయ్యారు, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రి పదవులు నిర్వహించారు. పీసీసీ చీఫ్ గా రెండు సార్లు అసెంబ్లీలో విపక్ష నేతగా ఒకసారి చేసి రెండు సార్లు ముఖ్యమంత్రిగా పీఠం అధిరోహించారు.వైఎస్సార్ ప్రతిపక్షంలో ఉన్నా ఆయన పొలిటికల్ గ్లామర్ ఇమేజ్ ఏ మాత్రం చెక్కు చెదిరేది కాదు. ఆయన చుట్టూ ఎపుడూ జనాలే ఉండేవారు. ఇక తనతో ఉన్న వారికి ఆయన చక్కగా చూసుకోవడమే కాదు తాను వారిని నమ్మేవారు తనతో పాటుగా తన ఎదుగుదలతో పాటుగా వారికీ చోటు ఇచ్చేవారు. వారిని కూడా తనతో సమానంగా అందలాలు ఎక్కించిన గొప్ప నాయకుడి లక్షణం ఆయనలో కనిపిస్తుంది.అంతే కాదు వైఎస్సార్ కి ఉన్న బలం బలహీనత ఒక్కటే. ఆయన అందరినీ నమ్ముతారు. అన్నింటికీ మించి తన వద్దకు వచ్చిన వారికి ఆయన అభయం ఇస్తారు. మళ్ళీ మాట వెనక్కి తీసుకోవడం అన్నది ఉండాదు. అందుకే నిండైన ఆయన రాజకీయ వ్యక్తిత్వం ఎందరికో స్ఫూర్తిదాయకంగా మారింది. వైఎస్సార్ అన్న మూడు అక్షరాలు తెలుగు రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా ఉండిపోయాయి.

## బీజేపీపై ఆర్ఎస్ఎస్ ప్రభావం పనిచేస్తుందా? అందుకే ఈ ఎంపికలా?

**హైదరాబాద్ పెన్ పవర్:**భారతీయ జనతా పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక మైన నిర్ణయాలను తీసుకుంటుంది. బీజేపీ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కోసం పనిచేసిన వాళ్లను, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవాళ్లు, కమిట్ మెంట్ తో పనిచేసిన వాళ్లకు మాత్రమే అవకాశాలు కల్పిస్తామని చెప్పకనే చెబుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలను కొంత పక్కన పెడుతున్నట్లే కనపడుతుంది. దీంతో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల్లో కొంత అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. అయినా కేంద్రంలో అధికారంలో ఉండటంతో ప్రస్తుతానికి ఏమీ మాట్లాడేందుకు బయటకు రాకపోయినా వారు మాత్రం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.




### తెలంగాణలో ముఖ్యమైన పదవులు...

తెలంగాణలో కేంద్ర మంత్రి పదవులు రెండు ఇచ్చారు. అందులో ఒకటి కిషన్ రెడ్డి కాగా, మరొకరు బండి సంజయ్. ఇద్దరూ పార్టీలో సీనియర్ నేతలు. పార్టీతో దశాబ్దకాలం అనుబంధం ఉన్న వారు. ఇక్కడ సామాజికవర్గాలను చూడకుండా కేవలం పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి మాత్రమే అవకాశం కల్పించారు. రాజ్యసభ స్థానాన్ని కూడా పార్టీలో సుదీర్ఘకాలంగా ఉన్న కె. లక్ష్మణ్ కు కేటాయించారు. అంతే తప్ప మరొకరికి ఈ అవకాశం ఇవ్వలేదు. ఇక తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు అనేక ఆశలు పెట్టుకున్నారు. కానీ అందరి ఆశలను తలకిందులు చేస్తూ పార్టీకి విధేయుడిగా ఉంటున్న కె.రామచంద్రరావును బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు.

### అన్ని పదవులూ వారికే...

ఆంధ్రప్రదేశ్ లోనూ అంతే జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే తమకు మంత్రి పదవి ఖాయమని చాలా మంది అంచనాలు వేసుకున్నారు. కానీ వారిందరినీ పక్కన పెట్టి సత్యకుమార్ యాదవ్ ను మంత్రి పదవికి ఎంపిక చేశారు. ఇక కేంద్ర మంత్రివర్గంలో పురంద్రీశ్వరి లాంటి వాళ్లను పక్కనపెట్టి శ్రీనివాసవర్మ లాంటి పార్టీకి నిబద్ధత కలిగిన నేతను ఎంపికచేయడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇక రాజ్యసభ సభ్యుడిగా పాకా వెంకట సత్యనారాయణ ఎంపిక కూడా అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. ఇక తాజాగా పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మాధవ్ ను ఎంపిక చేయడంతోనే ఇక ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పదవులు ఉండబోవన్న సంకేతాలు ఇచ్చినట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.భవిష్యత్ లోనూ ఎంపికలు ఇలాగే ఉంటాయని చెబుతుండటంతో పార్టీ మారి వచ్చిన నేతలు కొంత పునరాలోచనలో పడినట్లు తెలిసింది.